నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 15 మే 2025 | RANGAREDDY

సంకిరెడ్డిపల్లిలో నీటి ట్యాంకర్ వద్ద నీటి కోసం..

తాగునీటికి తండ్లాట

- జిల్లాలోని పలు గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి
- గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి
- సమస్య పరిష్కరించాలని అడిగితే చేతులెత్తేస్తున్న అధికారులు

మంచినీళ్ల కోసం బిందెలతో ప్రజల పడిగాపులు

పరిగి, మే 14 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని రుక్కుంపల్లి గ్రామంలో ప్రజలు గత కొన్ని రోజులుగా మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అయిదేళ్ల క్రితం కొత్తగా గ్రామపంచాయతీగా ఏర్పాటు కావడంతో తమ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావించి మొదటి ఎన్నికల్లో ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. అయిదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగింది. కాగా గత నాలుగు నెలల క్రితం రుక్కుంపల్లి గ్రామపంచాయతీని పరిగి మున్సిపాలిటీలో విలీనం చేస్తూ సీడీఎంఎ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ మున్సిపాలిటీలో విలీనమైన నాలుగు నెలల్లోనే గ్రామస్తుల కష్టాలు తీర్చేవారు కరువయ్యారు.

నీటి కోసం గంటల తరబడి

రుక్కుంపల్లి గ్రామానికి మిషన్ భగీరథ నీరు కనీసం అరగంట సైతం రావడం లేదని వాపోతున్నారు. గ్రామంలో డైరెక్టర్ పంపింగ్ సిస్టమ్ ద్వారా నీటి సరఫరాకు సంబంధించి ఒక బోరు మోటర్ స్టార్టర్ కాలిపోయి రోజులు గడుస్తున్నా మరమ్మతుల పేరిట తీసుకువెళ్లి ఇప్పటివరకు బాగు చేయించలేదని తెలిపారు. ఓవైపు మిషన్ భగీరథ నీరు సరిపోకపోవడం, మరోవైపు సింగిల్ ఫేజ్ మోటర్లతో నీరందించే బోర్లలో నీటిమట్టం తగ్గిపోయింది. గ్రామస్తులు తాగునీటి కోసం సింగిల్ ఫేజ్ మోటర్ ఉన్న బోరు నీటినే వాడతారు. గత పదిహేను రోజులుగా ఈ బోరు ద్వారా నీరు సరిగ్గా రావడం లేదు. గ్రామంలోని మెజారిటీ ఇళ్ల వారు మంచినీటి కోసం ఒకే బోరు వద్ద గంటల తరబడి బిందెలతో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్టార్టర్ లేని మంచినీటి బోరు

తమ నీటి కష్టాలపై మున్సిపల్ అధికారులకు విన్నవిస్తే మిషన్ భగీరథ నీరు వస్తున్నాయి కదా, ఇంకేమి సమస్యంటూ దబాయిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో గ్రామపంచాయతీగా ఉన్నపుడు పంచాయతీ కార్యదర్శి రోజూ గ్రామానికి వచ్చేవారని, మున్సిపాలిటీలో విలీనం తర్వాత కొత్తగా వచ్చిన కార్యదర్శి విధులకు సరిగ్గా హాజరుకావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో సైతం తెలియడం లేదని, ఇప్పటికైనా తమ గ్రామంలో మంచినీటి ఇబ్బందులు తొలగించాలని వారు కోరుతున్నారు.

గోడు వినిపించుకోరా..

తాండూరు రూరల్ : వారం రోజులుగా తాండూరు మండలం సంకిరెడ్డిపల్లి పంచాయతీతోపాటు అనుబంధ గ్రామమైన సంకిరెడ్డిపల్లితండాలోని గిరిజనులు మంచినీరు లేక అల్లాడుతున్నారు. దీనిపై మండల అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులెత్తేశారు. మిషన్ భగీరథ నీళ్ళు బంద్ కావడంతో ప్రజలకు నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. గతంలో సీఎం కేసీఆర్ చలవ కారణంగా మిషన్ భగీరథ పథకం ద్వారా 50 ఏళ్ల నీటి సమస్య తీరింది. కాంగ్రెస్ ప్రభుత్వం మంచినీటిని కూడా ఇవ్వలేకపోతున్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని బోర్లు పట్టిపోయాయి. దీంతో దిక్కుతోచని ప్రజలు వ్యవసాయ బోర్లపై నీటి కోసం ఆధారపడుతున్నారు. ఉదయం లేవగానే వ్యవసాయ బోర్ల వద్దకు క్యూ కడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ తమ గోడు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గ్రామానికి చెందిన కావలి జగదీశ్ తన సొంత నీటి ట్యాంకర్ ద్వారా సంకిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు బోరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నాడు. సంకిరెడ్డిపల్లి తండాకు జనుముల నందు తమ వ్యవసాయ బోరు నుంచి డైరెక్టుగా తండాలోకి పైపులైన్ ద్వారా గిరిజనులకు నీరు సరఫరా చేస్తున్నారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ బుధవారం సంకిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు. దారునవాగుతండా నుంచి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీలో చిల్లిగవ్వకూడా లేదని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు. నిధులు ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓ వ్యవసాయ బావి నుంచి గ్రామం వరకు పైపులైన్‌ద్వారా నీటి సరఫరా చేసేందుకు అధికారుల పరిశీలన

ఆలంఖాన్‌గూడలో..

చేవెళ్ల రూరల్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ సరిపడా నీరు అందించి బిందెలతో రోడ్లపైకి వచ్చే పరిస్థితిని రూపుమాపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గత పరిస్థితులే పునరావృతమవుతున్నాయంటే ప్రభుత్వం ఏవిధంగా పని చేస్తుందో ఇట్టే అర్థమవుతున్నది. ఎండాకాలం షురూ అవ్వకముందు నుంచే గ్రామాల్లో నీటి సమస్యలు ప్రారంభమయ్యాయి. శంకర్‌పల్లి మండల పరిధి ఆలంఖాన్‌గూడ గ్రామంలో కూడా ఇదే రిపీట్ అవుతున్నది. నీటి ఎద్దడితో గ్రామస్తులు సతమతమవుతున్నారు.

మిషన్ భగీరథ పైపు లైన్‌లో లో ప్రెషర్‌తో సరఫరా అవుతుండడంతో సమస్య ఉత్పన్నమవుతున్నదని ఆలంఖాన్‌గూడ గ్రామస్తులు వాపోతున్నారు. అస్సలు నీరు సరిపడా రావడం లేదని, వచ్చిన నాలుగైదు బిందెలతోనే కాలం వెల్లదీస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్ ఫీట్ లోతులో ఉన్న పైపు లైన్లపై భారీ వాహనాలు వెల్లడంతో లోపల జామై నీరు తక్కువగా వస్తున్నదని అంటున్నారు.

ఎవరూ పట్టించుకోవడంలేదు

మా గ్రామంలో నీటి సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా సమస్యకు పరిష్కారం దొరకడంలేదు. చూస్తాం.. చేస్తాం అనుడే తప్పా ఎవరూ వచ్చింది లేదు. చేసిందీ లేదు. అధికారులు స్పందించి నీటి ఎద్దడిని నివారించాలి.

- దమ్మన్నగారి శివకుమార్‌రెడ్డి, ఆలంఖాన్‌గూడ, చేవెళ్ల సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ చైర్మన్

కొనుగోలు కేంద్రాల్లో దళారులదే రాజ్యం!

మంచాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రోజుల తరబడి నిల్వ ఉన్న ధాన్యం

- వ్యాపారులు తీసుకొచ్చిన ధాన్యానికి త్వరగా కాంటా చేస్తున్న కేంద్రాల సిబ్బంది
- రైతుల వడ్లు తూకం అయ్యేందుకు మూడు, నాలుగు రోజులు నిరీక్షించాల్సిందే..
- అన్నదాత నుంచి తక్కువ ధరకు కొంటూ.. ఎక్కువ ధరకు విక్రయం..

రంగారెడ్డి, మే 14 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ధాన్యం కొనుగోళ్ల విక్రయాల్లో దళారులదే పైచేయిగా మారింది. వారు రైతుల నుంచి తక్కువ ధరకు కొంటూ కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఒక్క రోజు కూడా నిల్వ ఉంచకుండా కొంటూ.. రైతుల వడ్లను త్వరగా కాంటా చేయకపోవడంతో వారు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మంచాలలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు తీసుకొచ్చిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతోనే రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది.

రైతుల పాస్‌బుక్కులతో దళారుల అమ్మకాలు

ఇటీవల జిల్లాలో అకాల వర్షాల కారణంగా రైతులు ముందుగానే పంటను కోశారు. కోసిన ధాన్యం కల్లాల వద్దే పచ్చిగా ఉన్నా దళారులు రూ.2000 లోపే చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఆ వడ్లను ఆరబెట్టి, నిల్వ చేసి తమకు అనుకూలంగా ఉన్న రైతుల పాస్‌బుక్కులతో కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. ఇందుకోసం ముందుగానే సంబంధిత రైతుల నుంచి వ్యాపారులు చెక్కులు తీసుకుని వారి పేర్లపై వడ్లను విక్రయిస్తున్నారు. ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమయిన వెంటనే ఆ డబ్బులను డ్రా చేసుకుంటున్నారు. కాగా జిల్లాలో అధికారులు 40 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లోనూ దళారులదే పైచేయిగా మారింది.

వెంటాడుతున్న హమాలీల కొరత

కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత తీవ్రంగా ఉన్నది. సరిపడా కూలీలు లేకపోవడంతో రైతుల ధాన్యం తూకం వేసేందుకు మూడు నుంచి నాలుగు రోజుల వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం కొనుగోళ్లలో వేగం పెంచకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్యూటీ మధ్యాహ్నం వరకే..!

- తర్వాత ఖాళీ కుర్చీలే దర్శనం..
- చేవెళ్ల ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉండని అధికారులు, సిబ్బంది

మధ్యాహ్న సమయంలో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న చేవెళ్ల ఎంపీడీవో కార్యాలయం

చేవెళ్ల రూరల్, మే 14 : ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. ఏదో అలా వచ్చి.. మధ్యాహ్నం వరకే డ్యూటీ చేసి.. ఆ తర్వాత పలాయనం చిత్తగిస్తున్నారు. దీంతో పలు సమస్యలను చెప్పుకొందామని వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం చేవెళ్ల ఎంపీడీవో కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మధ్యాహ్న సమయంలో సంబంధిత శాఖల అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అక్కడ ఒక అటెండర్ మాత్రమే అందుబాటులో ఉన్నాడు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అధికారులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తిరిగి తమ ఇండ్లకు వెళ్లిపోయారు. ఈ విషయంపై ఎంపీడీవో హిమబిందును ఫోన్‌లో వివరణ కోరగా టైపిస్ట్ అందుబాటులో ఉన్నాడని సమాధానమిచ్చారు.

షాద్‌నగర్ మార్కెట్ యార్డులో వర్షపునీటిలో తడిసిన విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

పంటంతా వర్షార్పణం

- బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం
- షాద్‌నగర్ మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం, మొక్కజొన్న
- ఏమి చేయాలో తెలియక కన్నీరుమున్నీరవుతున్న రైతన్న

షాద్‌నగర్, మే 14 : మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది రైతన్న పరిస్థితి. పంట రుణాలు మాఫీ కాక.. రైతు భరోసా రాక.. అప్పులు తీసుకొచ్చి సాగు చేసి పంటను అమ్ముకుందామని మార్కెట్ యార్డుకు తీసుకెళ్తే ప్రకృతి రైతుపై పగబట్టి పంటనంతా వర్షార్పణం చేసింది. దీంతో ఆరుగాలం కష్టపడిన అన్నదాత కన్నీరుమున్నీరవుతున్నాడు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వందలాది బస్తాల ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయింది. పంట తమ కండ్ల ఎదుటే నీటిలో కొట్టుకుపోతుంటే అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన శ్రీశైలంయాదవ్ అనే రైతుకు చెందిన 300 ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో సుమారు రూ.70,000 నష్టం జరిగిందని వాపోయాడు. అన్నారం గ్రామానికి చెందిన జంగయ్య అనే రైతుకు చెందిన ధాన్యం బస్తాలు 75 కాగా.. అందులో 25 బస్తాల ధాన్యం పూర్తిగా నీటిలో కొట్టుకుపోగా.. మిగిలిన వడ్లు తడిసిపోయాయి.

అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన 30 బస్తాల మొక్కజొన్న నీటిలో తడిసిపోవడంతో రూ.50,000 వరకు నష్టం వాటిల్లింది. దూసకల్ గ్రామానికి చెందిన నిరంజన్‌రెడ్డి అనే రైతుకు చెందిన ధాన్యం తడిసిపోవడంతో రూ.10,000 వరకు, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన శివ అనే రైతుకు చెందిన 300 బస్తాల ధాన్యం తడిసి రూ.50,000 వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న, ధాన్యం తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. దళారులు క్వింటాలుకు రూ.1800-రూ.1950 మాత్రమే చెల్లించి కొంటున్నారని.. తడిసిన ధాన్యాన్ని కొంటారో లేదోననే భయం అన్నదాతల్లో నెలకొన్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా వాటిపై రైతులకు అవగాహన లేకపోవడం, సకాలంలో డబ్బులు అందకపోవడంతోపాటు బోనస్ డబ్బులు రావనే ప్రచారం ఉండడంతో వాటి వద్దకు అన్నదాతలు వెళ్లడంలేదు.

తడిసిన ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న మహిళా రైతు

- కొనసాగుతున్న ఫార్మా భూముల కంచె పనులు
- ప్లాట్ల కబ్జా ఇవ్వాలని రైతుల వేడుకోలు
- ఫెన్సింగ్ పనులు అడ్డుకుంటామని హెచ్చరిస్తున్న అన్నదాతలు

ప్లాట్లు పంపిణీ చేయకుండా ఫెన్సింగ్ పనులా..?

నెల గడిచినా నెరవేరని అధికారుల హామీ

పాట్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

యాచారం, మే 14 : గత నెల 3న మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ భూముల సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అధికారులు పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఫార్మా భూములకు సర్వే చేపట్టి వెంటనే ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని సర్వేను అడ్డుకున్నారు. అన్నదాతలకు అదనపు పరిహారం కింద చెల్లించాల్సిన ఎకరాకు 121 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చాకే సర్వే చేపట్టాలని అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు సర్వే చేయకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆర్డీవో అనంతరెడ్డి అక్కడికి చేరుకొని రైతులు అందోళన చెందవద్దని, సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. రైతులు మాత్రం ప్లాట్లు పంపిణీ చేశాకే సర్వే చేయాలని పట్టుబట్టారు. దీంతో వారం రోజుల్లోగా ప్లాట్ల డ్రా తీసి కబ్జా చూపించడంతోపాటు ప్రభుత్వమే సొంత డబ్బులతో రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్ అందజేస్తుందని అధికారులు, పోలీసుల సాక్షిగా హామీ ఇచ్చి రైతులను శాంతింపజేశారు. ఆర్డీవో హామీ ఇచ్చి నెల రోజులు దాటినా ఫార్మా ప్లాట్ల పంపిణీ ఊసే లేదు. పైగా పోలీసుల పహరాతో సర్వే పూర్తి చేసుకున్న అధికారులు భూములకు ఫెన్సింగ్ వేసే పనులను సైతం ముమ్మరంగా చేపడుతున్నారు. రైతులు మాత్రం భూ నిర్వాసితులకు ప్లాట్లు ఇంకెప్పుడిస్తరోనని ఎదురు చూస్తున్నారు. నాడు సర్వేకు సహకరించాలని రైతులను ఒప్పించిన ఆర్డీవో అనంతరెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకట సత్యనారాయణ, ఏసీపీ రాజు, సీఐ కృష్ణంరాజు, తహసీల్దార్ అయ్యప్ప మాత్రం ప్రస్తుతం రైతుల సమస్యను పట్టించుకోకుండా వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే ప్లాట్లకు సంబంధించి డ్రా తీసి, రైతులకు ప్లాట్ల కబ్జా చూపించి, ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. లేదంటే భూములకు వేస్తున్న ఫెన్సింగ్‌ను అడ్డుకోవడంతో పాటుగా ఇకపై అట్టి భూముల్లో ఎలాంటి పనులు ముందుకు సాగనిచ్చేదిలేదని హెచ్చరిస్తున్నారు.

ఫార్మా ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన టీఎస్ఐఐసీ బోర్డు

రైతుల ఎదురుచూపులు

రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలోని బేగరికంచె (బల్జగూడ)లో ఫార్మా భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కందుకూరు మండలం బేగరికంచె వద్ద 620 ఎకరాల్లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ లేఅవుట్‌ను బ్లాకులవారీగా ప్లాట్లను తయారుచేశారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఎకరాకు 121 గజాల స్థలం ఇచ్చేందుకు గత ప్రభుత్వం రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చిన విషయం తెలిసిందే, ఇప్పటికే మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన లబ్ధిదారుల జాబితాను సైతం అధికారులు విడుదల చేశారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్లాట్ల లబ్ధిదారుల పూర్తి స్థాయి జాబితాను రైతులకు అందుబాటులో ఉంచారు. గత దసరా నుంచి రైతులు ప్లాట్ల పంపిణీ ఎప్పుడు జరుగుతుందోనని వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు.

మేడిపల్లిలో కొనసాగుతున్న ఫెన్సింగ్ పనులు

మండలంలో 979 మంది రైతులకు 3745 ప్లాట్లు

యాచారం, కందుకూరు, కడ్తాల మండలాలకు చెందిన 5720 మంది రైతులకు ప్లాట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో యాచారం మండలంలోని నాలుగు గ్రామాలకు కలిపి ఎకరాకు 121 గజాల చొప్పున 979 మంది రైతులకుగాను 3745 ప్లాట్లు కేటాయించారు. ఇందులో కుర్మిద్ద 1240, నానక్‌నగర్ 359, మేడిపల్లి 1601, తాటిపర్తికి 545 పాట్లు మంజూరు చేశారు. రైతుల పేర్లు కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన పూర్తి జాబితాను ఇప్పటికే ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో రైతులకందుబాటులో ఉంచారు. ప్లాట్లకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలున్నా స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అధికారులు పేర్కొన్న విషయం తెలిసిందే, ఫార్మా ప్లాట్ల లబ్ధిదారుల్లో యాచారం మండలంలో మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, కందుకూరు మండలంలో మండలం మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, పంజాగూడ, సాయిరెడ్డిగూడ, అన్నోజీగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, కడ్తాల మండలంలో పల్లెచెల్కతండా గ్రామాలకు చెందిన రైతులున్నారు. త్వరలో ఇండ్ల స్థలాలు పంపిణీ చేసి, రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

నిర్వాసితులకు ఎకరాకు 121 గజాల ప్లాటు

ఫార్మా భూ నిర్వాసితులకు పరిహారంతో పాటు అదనంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని బేగరికంచె (బల్జగూడ) వద్ద సర్వేనం.90, 91లలో ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లను ఇచ్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే లబ్ధిదారులకు పాట్లకు సంబంధించిన పట్టాలను గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేసిన విషయం తెలిసిందే. రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించే సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ప్లాట్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. యాచారం, కందుకూరు, కడ్తాల మండలాల భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలను ఇప్పటికే అందజేసింది. దీనికోసం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో బల్జగూడ ప్రాంతంలో సుమారు 622 ఎకరాల్లో హెచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. అక్కడ భూమి చదును చేసి బ్లాకుల వారీగా ప్లాట్లను తయారు చేసి, రోడ్ల నిర్మాణం సైతం చేపట్టారు. ప్లాట్ల పక్కనే నయానగరి (ఫోర్గ్ సిటీ) నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పనులు సైతం శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులకు ఫార్మా ప్లాట్లపై ఆశలు చిగురించాయి. అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ప్లాట్లను అందజేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం ప్లాట్లు పంపిణీ చేయాలి

అధికారులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. వారం రోజుల్లోగా ప్లాట్ల కబ్జా చూపిస్తామని అధికారులు, పోలీసులు హామీ ఇచ్చి నెల దాటినా ప్లాట్లు పంపిణీ చేయకపోవడం బాధాకరం. అది నెరవేర్చకుండానే ఫార్మా భూముల సర్వేను పూర్తి చేసుకున్నారు. ఇప్పుడు ఫెన్సింగ్ పనులను సైతం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరలో ప్లాట్లు పంపిణీ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఫార్మా భూముల ఫెన్సింగ్ పనులను అన్ని విధాలుగా అడ్డుకుంటాం. భవిష్యత్తులో గ్రామంలో ఎలాంటి పనులను కొనసాగించేదిలేదు. రైతులతో కలిసి అడ్డుకుంటాం.

- పాశ్చా బాషా, మాజీ సర్పంచ్, మేడిపల్లి

త్వరలో ఇచ్చేందుకు కృషి

భూనిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను డ్రా పద్ధతిలో త్వరలోనే కేటాయించేందుకు కృషి చేస్తాం. ప్లాట్ల లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు. రైతులకు ప్లాట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం. త్వరలోనే డ్రా పద్ధతిలో ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. అర్హులైన లబ్ధిదారులకు ఎకరాకు 121 గజాల చొప్పున ప్రభుత్వమే రైతుల రిజిస్ట్రేషన్ చేయించి రైతులకు డాక్యుమెంట్ ఇస్తుంది.

- అయ్యప్ప, తహసీల్దార్, యాచారం